



# వెనుకబడిన ప్రయాణీకుడు

ఏమోయ్ ! రామచంద్రా! పొద్దున్నే యిల్లా వచ్చావేం?'

ముకుందరావుగారి ప్రశ్నవింటూనే అదివఱకు యెంతగానో, ప్రాక్టీస్ చేసుకుని వచ్చిన ఆ రామచంద్రుడు, వులికిపడి 'ఔను ఎందుకొచ్చాను ?' అని ప్రశ్నించుకున్నాడు. పరధ్యానపు సైనికుడు అంతఃపురంలో అడుగుపెట్టి నట్లుంది తనపని !

ఆ వచ్చిన మనిషి చెప్పే జవాబేమిటో —అసలతనక్కడే వున్నాడో లేడో తనకనవసర మన్నట్లు ఠీవిగా 'సిగరెట్' పీలుస్తున్నాడు ముకుందరావు.

వాళ్ళమ్మాయి కుమారి సువర్ణ శ్యామల ఇంగ్లీషు పేపరు చూసుకుంటూ, అతనికేసి ఒక్కసారిచూసి, మళ్ళీ చదువుకుంటోంది. వాళ్ళు కూర్చోమనలేదు. అతను కూర్చోలేదు. కూర్చోమని పలుకరించనందుకు అతనికేమీ కించగాలేదు. అది సహజంగానే వున్నట్టూ, వాళ్ళ హెూందా తనానికి తగిన వాతావరణమైనట్లు అనిపిస్తోంది. పైగా వాళ్ళలా ముభావంగా వుండక మర్యాదచేస్తే తనే వేరు విధంగా పొరపడే అవకాశముంది. "డబ్బున్నవాళ్ళేగానీ, పాపం అమాయకులు" ! అనే అర్థం రావచ్చు. లేక "బహుశా, వీళ్ళకూ నాతో యేదో అ వ స ర మే వుంది. అందుకే యీ మర్యాద" అనే విచిత్రమైన వూహ, క లి గి తే కలుగవచ్చు!

రా మ చం ద్ర రా వు నవ్వుకున్నాడు. డబ్బున్నవారికీ – లేనివారికీ మధ్య యెంతటి మనస్పర్థలు, ఎంత వి ప రీ త పు అభిప్రాయాలు ! ఇంకోటిగూడా వుంది. తనిప్పుడు అప్పు అడగటాని కొచ్చాడు. ఆయనివ్వకపోతే వార్థి లుబ్ధుడుగా కనిపించటం, యిచ్చేస్తే "అ... కష్టించి సంపాదించిం దయితేకదూ ?" అనే అసూయా పూరితమైన బుద్ధికూడా

తులసీకృష్ణ

మనిషి కృతజ్ఞతతోబాటు గర్వితమై వుంటుంది. ఈ అభిప్రాయాలు అందరికీ వర్తించే నిర్వచనాలని కాదు. కానీ తనకు మాత్రం పరిమితమైనవి. ఎందుకంటే యిప్పుడు చేతులు మారిన డబ్బు - మళ్ళీ రామచంద్రరావు యిస్తాడనికానీ, ముకుందరావు తీసుకుంటాడనికానీ, యిద్దరికీ అట్టే నమ్మకం లేదు కనుక.

మళ్ళీ ఒక్కసారి కళ్ళెత్తి, రామచంద్రుడికేసి చూసింది సువర్ణ. శ్యామల ఆమె అతనికేమీ క్రొత్త కాదు చిన్నప్పట్నించీ పరిచితమైనదే! అయితే యీ అపూర్వమైన ప్రత్యేకత యౌవనం నేర్పిందో, డబ్బు నేర్పిందో అర్థం కాలేదు. గొప్ప నగను చూసినంత ఆకర్షణగా రామచంద్రుడు వీళ్ళకేసి, చూస్తూ వుండి పొయ్యాడు.

'నేనెందుకొచ్చానో అడిగి నన్ను వేధించకండి! దయచేసి యింకా కొంచెంసేపు మిమ్మల్నిలాగే చూడనీండి' అంటున్నట్లున్నాయతని చూపులు.

'అరె! కూర్చోవా? ఏమిటోయ్?' అన్నాడు ముకుందరావు జవాబీలేదు. ఎదుటిమనిషి కూర్చొనే వున్నాడో, నిల్చునేవున్నాడో గుర్తించగలడు ముకుందరావు. వాళ్ళమ్మాయి కొంచెం నవ్వబోయి. మళ్ళీ ఆ అందం అతను జ్ఞాపకం చేసుకుంటాడన్న లబ్ధత్వంతనేమో మానేసింది. అతను కూర్చుని కొంచెంగా చిరునవ్వు నవ్వాడు. క్షణం గడిపి మళ్ళీ సర్దుకుని కూర్చున్నాడు. మళ్ళీ నవ్వాలా? వద్దా? అనే ఆలోచనలో పడిపోయాడు! ముకుందరావు సిగరెట్ పారేసి పచార్లు సాగిస్తూ నమ్రతగా లేచి నిల్చోబోయిన రామచంద్రుడిని భుజాలుపట్టుకుని కూలేసి ప్రారంభించాడు:

'విన్నావటోయ్! రామచంద్రుడూ? భక్తులయెదుట ప్రత్యక్షమైన దేవుడు, నీకేం వరం కావాలో చెప్పవోయ్ నాయనా? అని అడిగేడట! ఏం?.........అతగాడికేం కావాలో—ఇతగాడికి తెలీనా? అది కాదు విషయం. భక్తులనోట వారి కోర్కెను పలికించాలనే వుద్దేశ్యమే ముఖ్యమని ఒప్పుకుంటావా?— అట్లా పలికించటంలో ప్రయోజనమేమిటీ? అంతే, దాని కొక గొప్ప ఆధ్యాత్మిక ప్రయోజనముంది మనమంత దూరం వెళ్ళవలసిన అవసరం లేదనుకో... ...' రామచంద్రుడి ఒళ్ళు జల్లుమంది. సంతోషమో— భయమో, ఆయన సంభాషణ చాతురానికి సాగి మ్రొక్కటమో, లేక ఆ ఉపమానాలలోని తన్ను గురించిన అహంకారం తలచుకుని, అసహ్యించుకుని కోపం ప్రదర్శించాలో— ఏది చూపెట్టాలో ఏమీ అర్థం కాకుండా పోయిందతనికి.

'ఊరకరారు మహాత్ములు'— అనిఅమ్మాయిగారు, 'నే రచింపబోవు ప్రబంధమ్మునకు కథాక్రమం బెట్టిదన' అనే ధోరణిలో కొంచెం తెంతాలిగించింది.

'అయితే మునీశ్వరు లేదో 'ఎత్తు'తోనే రాజదర్బారు కొచ్చాడంటావ్?' కొంచెం నవ్వుతూ అన్నాడు.

'ఏం దేహమేలా? కేవలం 'కాఫీ' కోసం యింత శ్రమ పడతారనుకోము'—ఇద్దరూ నవ్వారు.

రామరామ! వీళ్ళిద్దరూ మహా క్రూరులు! కేవలం ధనవంతులమనే కారణంచేత ప్రపంచంలో అసంఖ్యాకంగా వున్న దౌర్భాగ్యుల్ని ఇంతలా హింసించటం భావ్యంకాదు.

'అయితే సెలవియ్యండి! మీ యాగంలో భాగం పంచుకుని, ఏదో మా తండ్రీ కూతుళ్ళ మింత 'పుణ్యం' సంపాదించుకుంటాము ... అన్నట్లు యాగం పేరేమిటో.........'

'అదే నాన్నా! నే చెప్పలేదూ... అది వీళ్ళ వంశీకులంతా ఆచరిస్తోన్న మరో క్రతువు! దానిపేరు-ధనదహన యాగం'— ముకుందరావు పడి పడి నవ్వాడు.

రామచంద్రరావు కిక అక్కడుండటం అసాధ్యమైపోయింది, పోవటం దుస్సాధ్యమైంది! 'వీళ్ళనేమిటి డబ్బడగటం? చస్తే అడగను'—మళ్ళీ అటునేపునించీ ఆలోచన చీకటిలా క్రమ్ముకొస్తోంది. అవును. చస్తే అడగను. సరే... మరి బ్రతికివున్నాను కదూ?... ...ఇప్పుడు రోషం ప్రదర్శించినదాని ఫలితం, రెండ్రోజుల తర్వాత మళ్ళీ యిక్కడికే వచ్చి— వీళ్ళ అవమానబాణం గురి చెదరకుండా, తల అటూ యిటూ కదపక బుద్ధిగా కూర్చోటమే! భగవంతుడా! డబ్బుయొక్క మహత్యం నీ లీలల్ని గూడా మించిపోయిందిగదా! ఇంక ఎందుకయ్యా, కథల్లో—సినిమాల్లో 'డబ్బు పాపిష్టిది' అనే డైలాగులు మానుకోరు! దౌర్భాగ్యుల్ని వంచించటం తప్పితే దాంట్లో అర్థమేముంది?

హఠాత్తుగా ఏదో జ్ఞప్తికొచ్చిన వాడిలా అన్నాడు ముకుందరావు.

'అమ్మాయ్! చూడు! సాధువులకట్టే కోపం తెప్పించకు! అది మన

---

- జోళ్ళషాపులోకి ఒకడు వెళ్ళి తన సైజుకంటె బాగా చిన్నసైజు బూట్లు చూపించి అవి యివ్వమన్నాడు.

'అవి మీకు బాగా యిరుకైపోతాయ్' అన్నాడు షాపువాడు.

'ఫరవాలేదు. నేను చాలా కష్టాల్లో వున్నాను. వ్యాపారం దివాళాలో వుంది. అప్పులవాళ్ళు పీడిస్తున్నారు. ఇద్దరాడపిల్లలు పెళ్ళి కెదిగి కూర్చున్నారు. మా ఆవిడకి నాలుగేళ్ళనుంచీ జబ్బు తగ్గడంలేదు. అందుకని రోజంతా యిరుకుబూట్లు తొడుక్కుని సాయంత్రం విప్పేస్తే వచ్చే సుఖమే నా కిహ మిగిలింది' అన్నాడతడు కళ్ళు తుడుచుకుంటూ.

లాంటివారికంత మంచిదికాదు. పైగా యితగాడి వంశం పూర్వ ఋషిసంప్రదాయంలోది. వీళ్ళ నాన్న నీకు తెలీదులే... ...నాకు తెలుసు. ఆయనకి కొడుకై పుట్టడంవల్ల — ఇతగాడంటే నాకు ప్రేమ పెరిగి పోతోందేగాని, తరిగే వుపాయమేమీ తోచటంలేదు. ఇతడైనా ఎంతో మంచివాడు, ధనవంతుల అక్రమాల్నిగురించి కరపత్రాలు ప్రచురించి, ఉచితంగా పంచేయగలడు. తీసుకున్న అప్పు తీర్చాలన్న దిగులెన్నడూ పెట్టుకోడు—' నవ్వుతూనే నిష్క్రమించాడు ముకుందరావు.

అమ్మాయికూడా నవ్వుతూ నవ్వుతూనే విసుగు నటిస్తూ అంది. "చెప్పండి బాబూ! చప్పున. ఎంత?"

"వంద!... ..."

"వందా?—ఏం?"

రామచంద్రరావు కర్థం కాలేదు.

"అంటే ఎగవెయ్యడానిక్కూడా ఓపిక కావాలా?"

"మీరలా నా నిజాయితీని 'కించ' పరచటమేమీ బావుండలేదు. మీ దగ్గర తీసుకున్న డబ్బంతా వ్రాసి వుంచుకున్నాను. ఇప్పటికి ఎనిమిదివందల యాభై అయింది..."

"ఆహా... ... ...పద్దులైతే వ్రాసి వుంచగలరు... ... ...కానీ తీర్చటమెలా?"

"లోకంలో [illegible] బాకీలు చేస్తున్న వాళ్ళెలా తీరుస్తున్నారో నేనూ అదే విధంగా తీర్చగలను— సంపాదించగలను... ...లేదా ఏదైనా అమ్మేసి తీర్చగలను!"

"సరే... ...ఇప్పుడు నే నివ్వకపోతే... ...ఏం చేస్తారూ?"

"ఎందుకివ్వరూ? ఇవ్వకపోతే యెలా? నేనూ — నా ప్రెస్‌లో పనివాళ్ళు -యింటద్దెలూ, నే చెయ్యబోయే సాహిత్యసేవా? ఇదంతా యేం కావాలి? అయినా నాకేమీ వుచితంగా అక్కర్లేదు. మీబాకీ తీర్చగలను..."

"ఆపండి! ఆపండి! ఆ పాట మీరు చాలాసార్లు పాడుతోండగా విన్నాను. వినగా - వినగా యిప్పుడది మొట్ట మొదటంత శ్రావ్యంగా వుండటంలేదు." పక్కుమని నవ్వింది. అతడదేమీ గమనించినట్లులేదు. "ఇప్పుడేమైందంటే, ఒకతనికి హఠాత్తుగా అపత్కాలమొచ్చి పడింది. పాపం లేకపోతే నన్ను డబ్బడిగే వాడే కాదు. మరి యింటాయనకి యేదో అవసరమేవచ్చిపడింది లేకపోతే ఆయనా అడిగేవాడు కాదు మరి. మా చెల్లాయి పాపం! మీరు చూశారుగదా దాన్ని! అచ్చం మా అమ్మలాగే వుంటుంది. ఎంతో మోజు పడింది. లేకపోతే అచీరె కొనిపెట్టమనేదికాదు..."

"ఉండండి, నేను పూర్తి చేస్తాను. ఇంతకీ మీ దగ్గర డబ్బులేదు — ఉంటే మమ్మల్నడిగేవాళ్ళే కాదు... మా దగ్గర డబ్బుంది ... లేకపోతే మేమిచ్చేవాళ్ళమే కాదు... సరి, యీ గేయం చాలా బావుంది.



ఏదేనా పత్రికకి పంపండి...' అంటూ 'బ్యాగ్' తీసి ఓ వందనోటువిసరేసింది. అందుకుంటూ అన్నాడతడు.

"ఇంతకీ మీరేమీ వుచితంగా..." పూర్తి చెయ్యకుండానే అమ్మాయి లోపలి కెళ్ళిపోయింది.

ఈ విధంగా ప్రవేశమైన యీ ముగ్గుర్నీ ముగింపుదాకా లాక్కురావలసిన బాధ్యత నా మీదుంది గనుక, వినవలసిన భారం మీ మీదుంది గనుక, మీకూ - నాకూ సులభమైన దగ్గర మార్గమిలా ఆలోచించాను. చిత్తగించండి...

ఒకానొకనాడు ప్రశాంతమైన వుదయం. హృదయంనిండుగా, (సిగరెట్ పొగ) సంతోషం నిండుకున్నప్పుడు - కాఫీ తీసుకుని అమ్మాయి యెదురుగా వస్తోన్నప్పుడు - పూర్వస్మృతి వర్తమానంలోకి దుమికి అలలు లేపినప్పుడు - యిలా ఆలోచించాడు ముకుందరావు.

"అవును, ప్రభావతీ! అమ్మాయి శ్యామల పెద్దదయిపోయింది. ముమ్మూర్తులా నీలాగే వుందికూడా; నువ్వులేవు, 'అమ్మాయి పెళ్ళి సంగతి యేమాలోచించారు?' అని నన్నడిగే వాళ్ళెవరూ లేరు. కనుక ఈ క్షణం వరకూ నాకీ సంగతి జ్ఞాపకమే రాలేదు. అయినా మంచిదే... ఇప్పటికైనా తెలుసుకున్నాను. తెలుసుకున్నాననటంకన్నా, నువ్వు చెప్తోంటే వింటున్నాననటంలోనే నిజముందేమో? వివాహాన్ని గురించిన నా అభిప్రాయం నీకు తెలుసు. అమ్మాయిని గురించి నాకు తెలుసు. కనుక మనకేమీ భయంలేదు. ఇంతేనా? తండ్రివైనందుకు నీ బాధ్యత! అని నిలదీస్తే నిలవటం కష్టమనుకో! అన్నట్లు చూడు ... మీ పరమేశ్వరన్నయ్య కుమారుడు, రామచంద్రుడు యిప్పుడు మనకు దావులోనే వున్నాడు. మంచివాడు! అమ్మాయికెలా కనిపిస్తాడోకానీ: నాకు మాత్రం, అందంగానే కనిపిస్తోన్నాడు. అయితే సంపాదనేమీ లేదు. పోనీ, మనం కావాలనుకుంటే మనదంతా అతనిదేకదా? అయినా మనమ్మాయి సువర్ణ శ్యామల కళ్ళకు తన భవిష్యత్తుకేసి స్పష్టంగా చూడగలశక్తివుందని నాకు నమ్మకముంది! అందుకనే ఏ చీకూ చింతా లేకుండా సిగరెట్లతో, షికార్లతో కాలం వెళ్ళబుచ్చుతున్నాను నేను.

మరొకనాడు సాయంకాలం.

అల్లసాని పెద్దన్నకు— 'ఏవిహంగముగన్న' — అన్నపద్యం మకుటానికి రూపం కల్పించిన మనోహరమైన సాయంకాలం! యువరక్తం బుకాపోడిగా, మన్మధుడు పూల బాణం ప్రయోగించి, జగత్తునంతా ముంచేసినట్లున్న వాతావరణంలో, చిరునవ్వుతో, చెక్కిట చేయిజేర్చి యిలా పాడుకుంది కుమారి సువర్ణ శ్యామల.

"బావా! రామచంద్రరావూ! నువ్వొట్టి వెర్రివాడివా? లేక మరీ మితిమీరిన సరసుడివా? అర్థం కాకుండా పోయింది. అర్థంకాని పరిస్థి

తుల్లోకి నెట్టడమే యౌవనంయొక్క ముఖ్యలక్షణమా ఏమి? అందంగా— యౌవనానికి స్వాగత పీఠంలా వున్నాను. ఒంటిగా—చనువుగా వున్నాను. ప్రేమ వెలిగే కళ్ళతో, పులకరిస్తే చేయిచాస్తే తక్షణం తీగెలా చుట్టివేయడానికి సిద్ధంగా వున్నాను. ఇది గ్రహించలేదా? లేక నిగ్రహం చూపెడుతున్నావా? ఇంకా ... ఇంకా... ...నా స్థాయి దిగజార్చాలనే నీచమైన అహంకారమా? లేక నాలోని యౌవనం నింపే రంగులకాంతి ప్రసారానికి వుపకరిస్తో—నిమిత్తమైన, అచేతనమైన 'కిటికీ'లాంటివాడివా? మా నాన్న గురించి నీకు తెలీదా? నన్ను రామచంద్రరావు కిచ్చి పెళ్ళి చెయ్యవయ్యా ... ... ... అంతే "అయం ముహూర్తం" అనగలదని, అర్థం కాలేదా? మరెందుకోయీ యీ జాప్యం? నీకేనా యీ పట్టుదల? సరే, ఎవరు జయిస్తారో కాచుకో!

అదే సాయంత్రం పరచిన పచ్చని—వెచ్చని శయ్యపై పడుకుని, అర్థంకాని నారికేళపాకాన్ని గూర్చి వ్యాఖ్యానం చేస్తోన్నాడు రామచంద్రరావు.

ధనికుల తత్త్వమేయింత! మీరు మాట్లాడే మాటల కన్నిటికీ అర్థం ఉండనవసరంలేదా? ఒక్క శ్యామల వంద శ్యామలల్లా కనపడుతుందేమిటి? ఇవ్వగూడనంతటి చనువు చూపిస్తుంది. మరుక్షణం వూహించనంతదూరం, త్రోసేస్తుంది. మందికి మారుపేరులా, ఆహానికి అవధిలా అగపడుతూంది. ఒక్కోసారి తన అహ్వానంకోసం కాముకున్నట్లు నటిస్తుంది. మరోసారి తన నోటివెంట ప్రేమ విషయమెత్తకం తడవుగా, ఫెడీ—ఫెడీమని వాయించి, పీడ విరగడ చేసుకుంటుం దనిపిస్తుంది.

అసలు శ్యామలతో ప్రేమవిషయమెత్తటమే కష్టం! మానవమాత్రుడికి సాధ్యమయ్యేలా తోచలేదు. మొన్న సంగతి మరీ చోద్యంగా వుంది.

"ఇన్ని సినిమాలు చూస్తున్నావు... ఇన్ని కథలు చదువుతున్నావు... ... కానీ, డబ్బు సంపాదించే అడ్డత్రోవ తెలిసికోలేకపోతున్నావుగదా అమాయకుడా?" అంది జాలిపడుతున్నట్లు. తన కర్థంకాలేదు.

"ఏముంది లక్షలకధికారి ముకుందరావుగారి కొక్కగానొక్క కుమార్తెను, నేను నిన్ను ప్రేమిస్తే, లేదా యేదో వయసులో వున్న దాన్ని, మోసంచేసి, వడిలో మోహన రాగం పాడేస్తే. బస్! నాన్నగారి ఆస్తి తమపేరిట ట్రాన్స్ఫర్". నవ్వుతోంది. నిజంగా అప్పట్లో ఆమె మీద యెన్నడూలేని అసహ్యం కలిగింది. ఛీ! ఛీ! యింకా యిల్లాంటి స్త్రీతో ప్రేమ విషయం మాట్లాడమే! ఆలోచిస్తే తనకూ - ఆమెకూ చాలా దూరమన్నట్లూ - నా దగ్గఱ యింకెన్నడైనా, ప్రేమసంగతి ప్రస్తావించేవు సుమా? అన్నభావము స్పష్టపడుతోంది. అయితే మనస్సు. దీని దుంప తెగా! యెప్పుడూ పీక్కు తినటమేనా దీనిపని?





ఎవరి నిర్ణయమెలావున్నా - కాలనిర్ణయం ముందుకు సాగటమే ననేది మనందరికీ తెలిసిందే! రెండు నెలలుగా వాళ్ళ తాతగారి వూరు వెళ్ళివచ్చిన రామచంద్రరావు విన్నాడప్పుడే... కుమారి సువర్ణ శ్యామలను శ్రీపాదమూర్తి బి. ఇ. గారి కిచ్చి చేస్తోన్న పెళ్ళి హడావిడి!

ఇంటి ముందు విశాలమైన పందిరి. పచ్చని మామిడాకుల తోరణాలు. ఒకవేపు 'లారీ'లతో యిసుక తోలుతున్నారు, పిల్లలంతా చెడు

గుడు ఆడుకుంటూ దారి ఇవ్వటమే లేదు. ముకుందరావుగారూ, మరో ముగ్గురు మనుషులూ, అటు వెడుతూ తనకేసి చూశారు.

"ఓహో! మా రామచంద్రుడొచ్చాడు! ఇక నాకు సగం భారం తీరింది. రావోయ్ రా!" అంటూ ఆహ్వానించాడు ముకుందరావు. రామచంద్రరావు అన్నీ చూస్తూ యింట్లోకి ప్రవేశించాడు. రేడియో రూంలో కూర్చుని, అద్దంలోకి చూసుకుంటున్న సువర్ణ శ్యామల వెనుతిరిగి చూసింది. రామచంద్రరావు ఆశ్చర్యపోయాడు! ఆమె అద్దంలో ముఖం చూసుకుంటున్న గుర్తులు లేవు. ఏదో తీవ్రంగా – శాంతంగా, ఆత్మకేసి పరిశీలిస్తోన్నట్లుగా తోస్తోంది ఎత్తుగా – పొత్తుగా, 'ఆర్చి'లా పూల మర్చుకుంది. విషాదమూ – సంతోషమూ రెండిటికీ అతీతమైన దేవతలా కనిపిస్తోంది. మఱచిపోయిన కాళిదాసుని శ్యామలాస్తుతిని జ్ఞప్తికి తెస్తోంది. అతన్ని ఆహ్వానించ లేదు. అసమ్మతి అసలే చూపించ లేదు. ఒకటి – రెండు, మూడు, నిమిషాలలాగే చూసి, కొంచెంగా నవ్వుతోంది, పూవు రేకులు ఒక్కొక్కటిగా విడుస్తోన్నట్లు.

"విన్నారుగా"

"విన్నాను"...

"మీ కానుకేమిటి మరి?"

"ఋణగ్రస్తుడిని ... అయినా నా శక్త్యానుసారం..."

"అది నేను వినదలుచుకున్నానని తెలియటంలా ..." చిరుకోపానికి కొంచెం నవ్వు జోడిస్తూ.

"నా స్వంత చేతుల్తో అక్షరాలు కూర్చి మీ పెళ్ళి పత్రికను నా ప్రెస్సు ద్వారా అచ్చు వేయించాలనుకున్నాను."

"కిరాయి... యే మాత్రం?"—

"ఉచితమే..."

"అబ్బ! అంత ఔదార్యమా. ఏ విధంగా వేస్తారో! చెప్పండి చూద్దాం!"

"కుమారి సువర్ణ శ్యామల, చి,సౌ, కుం... ..."

"అదేమిటి? తిట్టెయ్యడమా?"—

"ఉహూ... చిరంజీవి సౌభాగ్యవతి, కుంకుమ శోభిత కుమారి సువర్ణ శ్యామలను, శ్రీపాదమూర్తి బి. ఇ. గారికిచ్చి పెళ్ళి వైభవముగా జరుపబడును. ఏ తత్ శుభముహూర్తమునకు విచ్చేసి వధూవరుల నాశీర్వదించి మమ్మానందింప జేయుదురని ప్రార్థన..."

ఆమె అతడి కళ్ళకేసి చూస్తోంది. కళ్ళలోనించే, ఆత్మలోకి, వెళ్ళి – ఆత్మలోని చీకటి వాకిళ్ళు తెరుస్తోన్నట్లు! హఠాత్తుగా యిద్దరూ గట్టిగా నవ్వుకున్నారు. కళ్ళలో యేదో అపూర్వమైన తడిమంట వెలుగులు! ఆ వెలుగుల దారిలో నిల్చుని, వీడ్కోలు సందేశంలా యిలా అంది కుమారి సువర్ణ శ్యామల!

"ఏమయ్యా! రామచంద్రరావూ? నేనేమో ప్రయాణానికి సిద్ధమై సర్దుకుని కూచున్నాను. నువ్వేమో యిప్పుడిప్పుడు నడక నేర్చుకుంటున్నావు! ఎన్నో వేల మైళ్ళు నడవ్వలసిన ఈ ప్రయాణంలో తొందఱపడ్డానని, నిందవెయ్యక, మనస్ఫూర్తిగా ఆశీర్వదించి – పంపు మరీ..."

□□□

